## క్లుప్తంగా

### నేడు హర్ ఘర్‌కా తిరంగ్

పిట్టలవానిపాలెం: మండలంలోని నాలుగు గ్రామాల్లో హర్ ఘర్‌కా తిరంగ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శేషమాంబ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంతెనవారిపాలెం, పిట్టువారిపాలెం, భవనంవారిపాలెం, చందోలు గ్రామాలలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. నా భూమి–నా మట్టి, నా దేశం, వీరులకు వందనం, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

### 'ఖాజీపాలెం' కళాశాలలో లింగ సమానత్వంపై సదస్సు

పిట్టలవానిపాలెం: ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో గురువారం లింగ సమానత్వంపై(ఈక్వాలిటీ)వెబ్ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శివప్రసాద్ మాట్లాడుతూ యూజీసీ సౌజన్యంతో రాజనీతి శాస్త్రంలో ఒక రోజు వెబ్ సెమినార్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్సు పర్సన్‌గా కమలవేణి పాల్గొన్నారని తెలిపారు. లింగ సమానత్వం అనేది ఒక మానవ హక్కు అని, మహిళలు గౌరవంగా, స్వేచ్ఛగా పురుషులతో సమానమైన అవకాశాలతో జీవించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కమిటీ అధ్యక్షుడు ఎం.నరసరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీనివాసకుమార్, విద్యార్థులు ఉన్నారు.

### మిర్చి యార్డును సందర్శించిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు

కొరిటిపాడు(గుంటూరు): బాపట్ల వ్యవసాయ కళాశాల రెండో సంవత్సరం విద్యార్థులు స్టడీ టూర్‌లో భాగంగా గురువారం గుంటూరు మార్కెట్ యార్డును సందర్శించారు. వ్యాపార లావాదేవీల నిర్వహణ, రైతుల రాక, టర్నోవర్, యార్డులో ఎగుమతి, దిగుమతి వ్యాపారుల సంఖ్య, రైతుల నుంచి సెస్సు వసూలు, మౌలిక సదుపాయాల కల్పన, రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందా? లేదా? అని అధికారుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రశ్నలకు మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ వివరంగా సమాధానమిచ్చారు.

### అధ్యాపకురాలికి డాక్టరేట్



బాపట్ల: బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పుల్లగూర ప్రియదర్శినికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. హెటిరో సైక్లిక్ కాంపౌండ్ తయారీ, వాటి జీవ చర్యల మీద డాక్టర్ వల్లభనేని మాధవరావు పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియదర్శినిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ నజీర్ అభినందించారు.

### జూదరుల అరెస్ట్

కర్లపాలెం: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని కర్లపాలెం ఎస్‌ఐ ఎం.శివయ్య హెచ్చరించారు. యాజలి సమీపంలో వ్యవసాయ పొలాల మధ్య పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడి చేసి, పేకాట ఆడుతున్న ఐదుగురుని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,500 నగదు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని ఎస్‌ఐ తెలిపారు.

### రీ-సర్వేతో భూముల సమస్యలకు పరిష్కారం



గణపవరం(కర్లపాలెం): ప్రభుత్వం చేపట్టిన రీసర్వేతో భూముల సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దారు కేశవనారాయణరావు తెలిపారు. గణపవరం గ్రామంలో గురువారం డ్రోన్ ద్వారా చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ డ్రోన్ ద్వారా సర్వే చేయటం వల్ల భూముల విస్తీర్ణం, కొలతలు సరైన విధంగా వస్తాయని చెప్పారు. రీసర్వేతో రైతులకు ఉన్న భూ సమస్యలు తొలగిపోతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ సలీమా, ఆర్‌ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్‌లు, రైతులు పాల్గొన్నారు.

# స్వాతంత్య్ర వీరుల త్యాగాలు మరువలేనివి

కొల్లూరు: దేశ స్వతంత్య్రం కోసం ప్రాణ త్యాగం చేసిన వీరుల సేవలు మరువలేనివని డీఆర్‌డీఏ పీడీ, వేమూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి అర్జున్‌రావు అన్నారు. గురువారం రావికంపాడులో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ – నా భూమి – నా దేశం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని, మాట్లాడుతూ నేటి స్వేచ్ఛాయుత జీవనం.. స్వతంత్య్ర సమరయోధులు పోరాటాల ఫలితమేనన్న విషయాన్ని గ్రహించి, వారి త్యాగాలను స్మరించుకోవాలని సూచించారు. స్థానిక సచివాలయం వద్ద శిలాఫలకాన్ని ప్రారంభించిన, పంచ ప్రాణ ప్రతిజ్ఞ, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఐ.సత్యానారాయణరావు పాల్గొన్నారు. తోకలవారిపాలెంలో సర్పంచ్ టి. కృష్ణమోహన్ నేతృత్వంలో తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మొక్కలను నాటారు. బొద్దులూరుపాడు, చినపులివర్రు, మొసలిపాడు, పోతార్లంక, తాడిగిరిపాడు, తిప్పలకట్ట గ్రామాల్లో ఎంపీడీఓ, తహసీల్దారు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు.

**దేశభక్తిని పెంపొందించుకోవాలి**

రేపల్లె: విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలని ఐఆర్‌ఈఎఫ్ విద్యా సంస్థల అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలురెబ్బా అన్నారు. నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా ఆర్‌సీ కళాశాలలోని గాస్పల్ ఫీల్డ్స్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులు దేశం కోసం పోరాడి ప్రాణ త్యాగం చేసిన స్వాతంత్య్ర నాయకులను గౌరవించాలన్నారు. అనంతరం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఆర్‌ఈఎఫ్ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రెబ్బా, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బి.గురుస్వామి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.డానియేలు, ఎ.వంశీకృష్ణ, ఎం.రణధీర్, జి.నాని పాల్గొన్నారు.

**స్వాతంత్య్ర సమరయోధులకు సన్మానం**

పెరవలి పాలెం(వేమూరు): స్వాతంత్య్ర అమర యోధులను గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహసీల్దారు శ్రావణ్‌కుమార్ తెలిపారు. పెరవలిపాలెం గ్రామంలోని స్వాతంత్య్ర సమరయోధుడు చవ్వాకులు రంగయ్యను సన్మానించారు. పెరవలిపాలె, పెరవలి, చావలి, అబ్బనగూడవల్లి, పోతుమర్రు, చంపాడు గ్రామాల్లో నా భూమి, నా దేశం కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామంలో ప్రతిజ్ఞ చేశారు. ఆజాది కా అమృత్ మహోత్సవం ఈ నెల 14వ తేదీ వరకు నిర్వహించి 15న స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా జరుపు కోవడం జరుగుతుందన్నారు. పెరవలి, పెరవలిపాలెం, అబ్బనగూడవల్లి, పోతుమర్రు, చంపాడు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు విష్ణుమొలకల మైథిలీ రాణి, దాది వెంకట లక్ష్మీరాజ్యం, కె.రాంబాబు, కూచిపూడి మైనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తోకలవారిపాలెంలో మొక్కలు నాటుతున్న తహసీల్దారు



పెరవలిపాలెంలో స్వాతంత్య్ర సమరయోధుడు రంగయ్యకు సన్మానం

**ఘనంగా నా భూమి– నా దేశం..**

భట్టిప్రోలు: గొరిగపూడి, ఓలేరు, కోనేటిపురం, ఆళ్లమూడి, వెల్లటూరు గ్రామ పంచాయతీ కార్యాలయాలల్లో గురువారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్–నా భూమి–నా దేశం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిలాఫలకం ప్రారంభం, పంచ ప్రాణ ప్రతిజ్ఞ, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు జరిపారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ సర్పంచులు గరిగపాటి మల్లిక, మేరుగ రంగారావు, మోర్ల వెంకటేశ్వరమ్మ, పెద్దిశెట్టి రాంబాబు, చౌటూరి లక్ష్మి, ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, ఎంఈవో–2 ఎస్.దేవరాజ్, తహసీల్దారు డి.వెంకటేశ్వరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**నేడు 5 గ్రామాల్లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్**

భట్టిప్రోలు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్–నా భూమి–నా దేశం వేడుకలు శుక్రవారం మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక, కన్నెగంటివారిపాలెం, సూరేపల్లి, పల్లెకోన గ్రామాల్లో జరుగుతాయని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిలా ఫలకాలు ప్రారంభం, జెండా వందనం, పంచ ప్రాణ ప్రతిజ్ఞ, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.



మొక్కలు నాటుతున్న డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా



కోనేటిపురంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

**మొక్కలు నాటి, సంరక్షించాలి**

పిట్టలవానిపాలెం : మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కోమలి గ్రామ సర్పంచ్ శ్యామల నాగిరెడ్డి అన్నారు. స్థానిక సచివాలయం వద్ద గురువారం హర్ ఘర్‌కా తిరంగ్ కార్యక్రమం నిర్వహించారు. మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేషమాంబ, ఈఓపీఆర్డీ పద్మజ, కార్యదర్శి సుజాత గ్రామపెద్దలు ఉన్నారు.

**అందరూ ఐకమత్యంగా ఉండాలి**

నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలని డీపీవో దాసరి రాంబాబు తెలిపారు. గురువారం నల్లమోతువారిపాలెంలో జరిగిన నా మట్టి – నాదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామ సచివాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించి, మొక్కలు నాటారు. తహసీల్దారు కేశవనారాయణరావు కర్లపాలెం గ్రామ సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఏట్రవారిపాలెం, పాతనందాయపాలెం, కొత్త నందాయపాలెం, సమ్మెటవారిపాలెం గ్రామాల్లో నామట్టి నాదేశం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలలో సర్పంచ్‌లు నక్కా లలితకుమారి, చీరాల వెంకటలక్ష్మి, కావూరి చిట్టెమ్మ, ఆట్ల వెంకటేశ్వరమ్మ, పిట్టు నాగాంజనేయరెడ్డి, ఎంపీటీసీలు, తాండ్ర సాంబశివరావు, చీరాల పద్మావతి, ఆసిఫ్ అలీ, అమీర్‌బేగ్ తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి

పిట్టలవానిపాలెం : ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎంపీడీఓ శేషమాంబ తెలిపారు. మండలంలోని కోమలి, సంగుపాలెం, కోడూరు గ్రామాలలో గురువారం నాభూమి, నా దేశం, నా మట్టి, వీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో శిలా ఫలకాలు ఏర్పాటు చేయడంతో పాటు స్వాతంత్య్ర సమర యోధులు, అమర వీరులు, మాజీ సైనికులకు సన్మానం చేసి, మట్టిని సేకరించి మండలానికి, అలా దశలవారీగా దేశానికి పంపించాలని తెలిపారు. తొలుతగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు ఎనికేపల్లి శివకుమారి, ఎంపీటీసీ చెన్నుబోయినగంగయ్య, డీఎల్డీఓ సువార్త, ఈఓపీఆర్డీ పద్మజ, గ్రామ కార్యదర్శులు సుజత, రెబ్బాని, కుంభ శ్రీనివాసరావు, ఏపీఎం సంతోష్, ఏపీఏ సుభాషిణి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



మొక్క నాటుతున్న ఎంపీడీఓ శేషమాంబ

## సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారు

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- శిరిపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం



శిరిపూడిలో మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నగరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలోని శిరిపూడిలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఆర్థికంగా బలోపేతమవుతున్నారని అన్నారు. నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలల రూపురేఖలు మారాయని ఎంపీ గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో విద్య, వైద్య రంగాలకు సరైన ప్రాధాన్యత కల్పించకపోవడంతో విద్యార్థులు, ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్ విద్య, వైద్య రంగానికి అధిక నిధులు కేటాయించి, అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎంపీ మోపిదేవి కోరారు. ఎన్ని పార్టీలు కలిసినా విజయం మాత్రం వైఎస్సార్ సీపీదేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, మోపిదేవి రాజీవ్, సర్పంచ్ మేడిబోయిన ఉదయలక్ష్మి, ఎంపీటీసీ పాగోలు నాంచారమ్మ, తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు గణపతిరెడ్డి, కారంకి వెంకటేశ్వరావు, మాణిక్యారావు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- కర్లపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్లపాలెం: రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. శుక్రవారం కర్లపాలెం పంచాయతీ పరిధిలోని సత్యవతీపేట, బంగారురెడ్డిపాలెం గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. సత్యవతీపేటలో జాతీయ ఉపాధిహామీ పథకం నిధులు రూ.40లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ ఎన్నికల హామీలను 99శాతం అమలు చేసిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సాగుకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందజేస్తుందన్నారు. కర్లపాలెం సర్పంచ్ నక్కా లలితకుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్, ఎస్కే ఆసిఫ్ అలీ, నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, యల్లావుల ఏడుకొండలు, సమ్మెట వెకంటేశ్వరరెడ్డి, మందపాటి పరమానందకుమార్, మండే విజయకుమార్, చిక్కాల సాగర్, ఆట్ల పెద్ద శ్రీనివాసరెడ్డి, అహ్మద్‌బాషా, షంషీర్, వెంకటేశ్వరరెడ్డి, ఏడుకొండలరెడ్డి, ఆట్ల గిరిబాబురెడ్డి, తహసీల్దారు కేశవనారాయణరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కర్లపాలెంలో వృద్ధురాలికి బ్రోచర్ అందజేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి

# ముగిసిన 'వార్డు' నామినేషన్ల పర్వం

రేపల్లె రూరల్: వార్డు మెంబర్ల నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ ముగిసినట్లు ఎంపీడీవో శివపార్వతి తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడారు. చివరి రోజు రెండు నామినేషన్‌లు దాఖలైనట్లు తెలిపారు. బేతపూడి 7వ వార్డుకు కారుమూరు శివలీల, చాట్రగడ్డ 3వ వార్డుకు సుదర్శన్ నామినేషన్‌లు దాఖలు చేశారన్నారు. తొలిరోజు అందిన నాలుగు నామినేషన్‌లతో కలిపి మొత్తం 6 నామినేషన్‌లు దాఖలయ్యాయన్నారు.

**రెండు నామినేషన్‌లు**

భట్టిప్రోలు: కోనేటిపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 1, 5వ వార్డులకు 2 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ ఆఫీసర్, ఈవోపీఆర్డీ టి.ఊహారాణి గురువారం తెలిపారు. 1వ వార్డుకు తాతా అంకమ్మ, 5వ వార్డుకు పడమట వెంకటేశ్వరావు నామినేషన్ వేసినట్లు ఆమె పేర్కొన్నారు. పంచాయతీ సర్పంచ్ మోర్ల వెంకటేశ్వరమ్మ, కార్యదర్శులు అనురాధ, వెంకటేష్ బాబు, వైఎస్సాఆర్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు (నాని), మల్లోలు నాగబాబు పాల్గొన్నారు.

**వరాహాపురంలో రెండు నామినేషన్లు**

వరహాపురం(వేమూరు): వరాహాపురం గ్రామ పంచాయతీ 10వ వార్డుకు రెండు నామినేషన్లు వచ్చాయని పంచాయతీ ఎన్నికల అధికారి సీహెచ్ శేఖర్ గురువారం తెలిపారు. పిల్లి సుభాషిణి, వరికూటి కృష్ణకుమారి నామినేషనలు దాఖలు చేశారని వెల్లడించారు.



కోనేటిపురంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందచేస్తున్న అభ్యర్థి

**ఆరు నామినేషన్లు దాఖలు**

కొల్లూరు : వార్డు మెంబర్లకు ఆరు నామినేషన్లు దాఖలైనట్లు ఈఓపీఆర్‌డీ రవికుమార్ తెలిపారు. గురువారం నామినేషన్లు దాఖలకు ఆఖరిరోజు నేపథ్యంలో మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఆరుగురు రెండు వార్డులకు నామినేషన్లను అందజేసినట్లు తెలిపారు. దోనేపూడి 5వ వార్డుకు నలుగురు, చిలుమూరు 4వ వార్డుకు ఇద్దరు నామినేషన్లు వేసినట్లు తెలిపారు.

# నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

రేపల్లె: నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మోళ్లగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవల్లిక అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బేతపూడి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో 19 ఏళ్ల లోపు విద్యార్థులందరికీ గురువారం వైద్య సిబ్బంది ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో వైద్యాధికారి మాట్లాడుతూ నులిపురుగుల నివారణకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. రక్తహీనత, పోషక లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, శ్రద్ధ లోపం, వికారం, వాంతులు, విరోచనాలు, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు నులిపురుగుల వల్ల ఉంటాయన్నారు. నివారణకు చేతులు శుభ్రపరచుకోవాలని, బహిరంగ మలవిసర్జన చేయకూడదని, ఆరు నెలలకోసారి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, సర్పంచ్ ఆలూరి పద్మ, ఎంపీటీసీ మస్తాన్‌రావు, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రమోద్ పాల్గొన్నారు.

**విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ**

పెరవలి(వేమూరు): పిల్లల్లో నులి పురుగులు నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి సురేష్ తెలిపారు. మండలంలోని పాఠశాలలు, కళాశాలల్లో నులిపురుగుల నివారణకు మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ నెల 17న మరోసారి మాత్రలు విద్యార్థులకు వేస్తారని ఆయన తెలిపారు. గ్రామాల్లో ఇంటి వద్ద ఉండే పిల్లలకు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఈ మాత్రలు అందించాలని చెప్పారు. వేమూరు మండలంలోని 4,003 మంది విద్యార్థులకు గురువారం నులిపురుగు మందులు పంపిణీ చేయడం జరిగిందని వైద్యాధికారి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



మాత్రలు పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రవల్లిక, జెడ్పీటీసీ



పెరవలి పాఠశాలలో నులిపురుగుల మాత్రలు వేస్తున్న డాక్టరు సురేష్



భట్టిప్రోలులో నులిపురుగుల మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లలిత కుమారి



మాత్రలు మిగిస్తున్న వైద్యాధికారిణి డాక్టరు వైష్ణవికృష్ణ, ఎంపీపీ

**నులి పురుగుల మాత్రలు పంపిణీ**

భట్టిప్రోలు: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని గురువారం భట్టిప్రోలులోని విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, ఎంఈవో–2 నీలం దేవరాజు, సీహెచ్‌ఓ బి.మంగరాజు, హెచ్‌ఎస్ ఎన్.ప్రసన్న బాబు, కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, హెచ్‌ఎం ఫణి పార్థసారథి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. వెల్లటూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ చౌటూరి లక్ష్మి నులి పురుగుల మాత్రలు పంపిణీ చేశారు.

**నులిపురుగుల నివారణకు అల్బెండజోల్**

బాపట్ల అర్బన్: నులుపురుగుల నివారణకు ప్రతి ఒక్కరు ఆల్బెండజోల్ మాత్రలు మింగాలని వెదుకృపల్లి ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారిణి డాక్టరు వైష్ణవి కృష్ణ పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం స్టువర్టుపురంలోని గురుకుల పాఠశాలలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు పాల్గొని, విద్యార్థుల చేత అల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా డాక్టరు వైష్ణవికృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అర్హులైన వారందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, శుభ్రమైన నీటినే తాగాలని సూచించారు. నులిపురుగులు ఉన్న పిల్లలు పోషకాహార లోపానికి గురవుతారని చెప్పారు. పీహెచ్‌ఎన్ పద్మ, హెచ్‌వీ మీనాకుమారి, ప్రధానోపాధ్యాయుడు బుల్ల సోమయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మెగా జాబ్ మేళా

తెనాలి: ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సహకారంతో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా జరగనుంది. 30 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నారు. 1,086 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్: కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ తెనాలి డివిజన్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వనున్నట్లు సంస్థ కార్యదర్శి తాడికొండ చిన్నబ్బాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్‌లలో అత్యధిక మార్కులు సాధించిన పేద విద్యార్థులు ఈ నెల 27లోపు దరఖాస్తులు అందజేయాలని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 9440438904, 9849121668 7లో సంప్రదించాలని సూచించారు.

# 'స్టువర్టుపురం' పేరుతో చిత్రం తీసిన వారిపై చర్యలు తీసుకోవాలి

గిరిజన సంఘ నాయకుల డిమాండ్

బాపట్ల స్టువర్టుపురం పేరుతో చిత్రం తీసిన వారిపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘ నాయకుడు కొండారెడ్డి నరహరి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలోని చర్చి ఆవరణంలో ఈ నెల 31న నిర్వహించనున్న సభలో గిరిజన నాయకులు పాల్గొన్నాలని ఆయన కోరారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొండారెడ్డి మాట్లాడుతూ టైగర్ నాగేశ్వరరావు పేరుతో.. స్టువర్టుపురం దొంగ సినిమా నిర్మాణాన్ని తక్షణం నిలిపివేయాలన్నారు. స్టువర్టుపురం గిరిజనులను దొంగలుగా చిత్రీకరించడాన్ని సమాజానికి ఈనాటికి నేరస్తులుగా చూపిస్తున్న, చూపించబోయే సినిమాలను తక్షణం నిలిపివేయాలని కోరారు. వీటిపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు గంగయ్య, నూతలపాటి కోటేశ్వరరావు, పేరం సత్యం, మల్లీ రామకృష్ణ, బహుజన సమాజ్‌వాదిపార్టీ నాయకుడు కోటేశ్వరరావు, గిరిజన నాయకుడు దేవరకొండ రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండారెడ్డి నరహరిప్రసాద్